# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 1, మే 2026






## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలి

### రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా

నస్పూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులతో ప్రభుత్వ పాఠశాలలలో మోలిక వసతుల కల్పన, అకడమిక్ ప్యానెల్ విజిట్, ప్రీ ప్రైమరీ పాఠశాలలో వసతుల కల్పన, అధార్/అపార్ పురోగతి, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణ పురోగతి, కస్తూరిబా గాంధి, ఆదర్శ పాఠశాలల ఎస్ఎస్సి, ఇంటర్ తప్పిన విద్యార్థులకు శిక్షణ, ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ వారోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, మిగతా 2లో..

## మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు

జన్నారం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త




మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రమణమూర్తి, జన్నారం ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బాధితురాలు ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన అనంతరం వేసవి సెలవుల నిమిత్తం జన్నారం మండలంలోని కవ్వాల్ గ్రామంలో ఉన్న బంధువులు బాబాయ్, పిన్ని ఇంటికి వచ్చింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన డోంగరి లక్ష్మణ్ (20) అనే వ్యక్తి బాధితురాలతో సాన్నిహిత్యం ఏర్పరచుకొని ఫోన్లో మాట్లాడుతూ బాధితురాలితో ఫోటోలు దిగి, ఆమెను శారీరకంగా అనుభవించాలనే దురుద్దేశంతో అట్టి ఫోటోలను సోషల్ మీడియా, కుటుంబ సభ్యులకు చూపిస్తానంటూ బెదిరింపులకు పాల్పడి, బాధితురాలు కుటుంబ సభ్యులు లేని సమయం చూసి బాధితురాలిని బలవంతంగా శారీరకంగా అనుభవించాడని బాధితురాలు తన కుటుంబ సభ్యులకు విషయం తెలుపగా, బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, నిందితున్ని పట్టుకొని రిమాండ్ నిమిత్తం లక్షెట్టిపేట కోర్టులో హాజరు పరిచినట్లు సి.ఐ రమణా మూర్తి తెలిపారు.

## లక్ష్యసాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలి

● జీఎం మునిగంటి శ్రీనివాస్ ● ఆర్.కె 5 గనిలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిపై క్షేత్రస్థాయి సమీక్ష

నస్పూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



సంస్థ మనుగడే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రతి ఒక్కరూ రక్షణతో కూడిన నాణ్యమైన పనితీరును కనబరచాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఆర్.కె 5 భూగర్భ గనిలో అధికారులు, సేఫ్టీ కమిటీ, మైన్ కమిటీ, మైనింగ్ సిబ్బందితో నిర్వహించిన క్షేత్రస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన ఏడాది అనుభవాలను బేరీజు వేసుకుంటూ కొత్త వ్యూహాలతో ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడమే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశం ప్రారంభంలో డీజీఎం రాజన్న గత ఆర్థిక సంవత్సరపు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. యంత్రాల వినియోగం, పనిముట్ల లభ్యత, ఎదురైన ఆటంకాలపై సమగ్రంగా చర్చించారు. గత ఏడాది ఏరియా లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన నేపథ్యంలో, ఈసారి మొదటి రోజు నుంచే పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు జీఎం స్పష్టం చేశారు. ఆర్కె 5 గని గత ఆర్థిక సంవత్సరం స్వల్ప తేడాతో లక్ష్యానికి దూరమైనప్పటికీ, మిగతా 2లో..

## ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనల పట్ల వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా రవాణా శాఖ అధికారి రామచందర్ పేర్కొన్నారు. రవాణా శాఖ వారోత్సవాల్లో భాగంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యత కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక అవగాహన ర్యాలీలు, సమావేశాలు, డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు, యువతలో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, వాహనాల్లో నిషేధిత మందులు, గంజాయి తదితర వాటిని తీసుకెళ్ళొద్దని పేర్కొన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు ఉదయ్ బాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని వివరించారు. ఈ సందర్బంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని వాహనదారులతో డిటిఓ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రవాణా శాఖ అధికారులు, సిబ్బందికి వాసవి క్లబ్ సభ్యులు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ మోహన్, ఏఎంవిఐ రాజమల్లు, క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్రీధర్, సిబ్బంది వినయ్, రజిత పాల్గొన్నారు.



## స్వీయ గణన ప్రక్రియ ద్వారా జనగణన వేగవంతం

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

– హాజీపూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

వివరాలు 2లో..

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు త్వరగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇతర పూర్తి సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో ఫలితాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, గత ఫలితాలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఆధార్/ఆపార్ నమోదు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థినులకు ప్రత్యేక మరుగుదొడ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని సూచించారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులలో 10వ తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షలలో అనుతీర్ణులైన వారికి సరైన శిక్షణ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా విద్యాశాఖ వారోత్సవాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సదుపాయాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యా శాఖ వారోత్సవాలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, వారోత్సవాలలో భాగంగా పాఠశాలల్లో అదనపు గదులు, మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యసాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చివరి నెలలో 105 శాతం, ప్రస్తుత ఏప్రిల్ మాసంలో 103 శాతం ఉత్పత్తి సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ మనుగడకు నిర్దేశిత లక్ష్యాల సాధన అత్యంత కీలకమని, భూగర్భ గనులే ఉద్యోగుల ఉపాధికి మూలాధారమని ఆయన గుర్తు చేశారు. ఉత్పత్తితో పాటు గనుల జీవిత కాలాన్ని పెంచడంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట పని గంటలు పాటిస్తూ, యంత్రాలను సమర్థవంతంగా వినియోగిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. రక్షణ సూత్రాలను పాటిస్తూ ప్రమాదరహితంగా బొగ్గును వెలికితీయాలని కార్మికులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా, గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైద, గ్రూప్ ఇంజనీర్ భట్టాచార్య, డీజీఎం రాజన్న, సేఫ్టీ ఆఫీసర్ శివయ్య, పిట్ సెక్రెటరీ నర్సింగ్ రావు, అసిస్టెంట్ మేనేజర్లు, మైనింగ్ స్టాఫ్, సూపర్వైజర్లు, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

# స్వీయ గణన ప్రక్రియ ద్వారా జనగణన వేగవంతం

### - కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ ద్వారా కార్యక్రమం వేగవంతం అవుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలంనబ్బెపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికిహాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు జరగనున్న స్వీయ గణన ద్వారా జనగణన ప్రక్రియ వేగవంతం అవుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖవ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు,మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ వినియోగించాలని, ఇండ్ల గణనకు సంబంధించి 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి రివ్యూ ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు. మే 11వ తేదీ నుండి ఇండ్ల గణన అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు ఈ నెంబర్ ను అందించాలని తెలిపారు. ఆ సమయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే ఎన్యుమరేటర్ ద్వారా సవరించుకోవచ్చని తెలిపారు. వేసవి దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళలలో తమకు కేటాయించిన బ్లాక్‌లలోని ఇండ్లను సందర్శించేలా కార్యచరణ రూపొందించుకోవాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అంతకుముందు హాజీపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి సుమన్ తో కలిసి సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. గర్భిణుల ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగే విధంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మే డే ను కార్మిక దీక్ష దినంగా జరుపుకుందాం

### - యుసిసిఆర్ఐ(ఎంఎల్) పిలుపు - చికాగో మృతవీరులకు విప్లవ జోహార్లు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



ప్రపంచ కార్మిక వర్గ ఐక్యతకు ప్రతీకగా నిలిచిన మే డేను ఈ సంవత్సరం కార్మిక దీక్ష దినంగా జరుపుకోవాలని భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం యుసిసిఆర్ఐ(ఎంఎల్) పిలుపునిచ్చింది. సింగరేణి గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో విడుదల చేసిన ప్రకటనలో అంబాల మహేందర్ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి యుసిసిఆర్ఐ(ఎంఎల్) పార్టీ వారు తెలిపారు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కార్మిక వర్గం ముందున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన అల్లకల్లోల పరిస్థితుల మధ్య మే డే జరుపుకుంటున్నామని, ముఖ్యంగా అమెరికా వంటి అగ్రరాజ్యాల ఆధిపత్యం క్షీణిస్తున్నదని, ఆ దేశంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభం పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యం, మానవ హక్కుల పేరుతో సాగించిన దోపిడీ పాలన ఇప్పుడు బహిర్గతమవుతోందని విమర్శించారు. అమెరికా ప్రపంచంలోని ఇతర దేశాలపై ఏకపక్ష ఆర్థిక విధానాలు అమలు చేస్తూ, మౌలిక వనరులు ఉన్న దేశాల సంపదను ఆక్రమించేందుకు యుద్ధాలు ప్రేరేపిస్తున్నదని ఆరోపించారు. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ ప్రభుత్వాలను మార్చే ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. ఇక మరోవైపు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో కూడిన గ్లోబల్ సౌత్ దేశాలకు చైనా సహకారం అందిస్తూ సామ్రాజ్యవాద దోపిడిని ఎదుర్కోవడంలో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అమెరికా అనుకూల విదేశాంగ విధానం స్పష్టమైందని, అంతర్జాతీయ వేదికలపై స్వతంత్ర వైఖరి లోపిస్తున్నదని విమర్శించారు. పొరుగు దేశాల పట్ల జాతీయోన్మాద, యుద్ధోన్మాద ధోరణులు పెరుగుతున్నాయని అన్నారు. దేశంలో ప్రజా పోరాటాలను అణచివేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా మారిందని, సైనిక, అర్ధసైనిక బలగాల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో భూమి, ప్రజాస్వామ్యం, స్వాతంత్రం కోసం పోరాటం అత్యవసరమని తెలిపారు. భూస్వామ్య వ్యవస్థ రద్దు, దున్నేవానికి భూమి అనే లక్ష్యంతో కార్మికులు, రైతులు, ఇతర ప్రజా వర్గాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాద ప్రభావం లేని స్వతంత్ర విదేశాంగ విధానం కోసం ఉద్యమాలు సాగించాలని సూచించారు. ప్రపంచ కార్మికులారా ఏకమవండి. పోరాడితే పోయేదేమీ లేదు, బానిస సంకెళ్లు త!ప్ప అంటూ పిలుపునిచ్చారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలి

### - కలెక్టర్ కుమార్ దీపక్

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల 1, తిమ్మాపూర్ గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే సమయంలో నిబంధన ప్రకారం మట్టి గడ్డలు, తప్ప, తేమ ఇతర నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలలో త్రాగునీరు, నీడ, తూకం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేసిన తర్వాత ఆన్ లైన్‌లో ట్రక్ షీట్ జనరేట్ చేయబడుతుందని, కొనుగోలు కేంద్రం, మిల్లుల టాగింగ్ ఆటోమేటిక్ గాఅవుతుందని, ధాన్యం లారీ పక్కదారి పట్టకుండా జీపిఎస్ పరికరం బిగించబడి ఉంటుందని తెలిపారు. రైతు వివరాలను సిస్టం లో నమోదు చేసి ఆధార్ కార్డు ద్వారా వారి గుర్తింపును ధృవీకరించాలని, రైతు భూమి విస్తీర్ణం, పండించిన ధాన్యం వివరాలను సరి చూడాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే విధంగా పరిశీలించాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల బ్యాంకు ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని రైతులు ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకుతీసుకురావాలనితెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకుల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అవుట్ పేషెంట్ రిజిస్టర్, మందుల నిల్వలు, ల్యాబ్, వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి ఆవరణలో కొనసాగుతున్న పోస్టుమార్టం గది నిర్మాణ పనుల వివరాలు తెలుసుకొని త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు త్వరగా పూర్తి చేయాలనీ రాష్ట విద్యా శాఖ కార్యదర్శి మోగిత రాణ అన్నారు. గురువారం హైదరాబాదు నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యా శాఖ అధికారులతో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా విద్యా శాఖ వారోత్సవాలు నిర్వహణపై విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లోని విడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన విడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ యువరాజ్ మార్మట్ తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈడబ్ల్యుఐడిసి ఇంజనీరింగ్ ఆద్వర్యంలో పాఠశాలలో చేపడ్తున్న మోలిక వసతుల పనులను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. 88 ప్రి ప్రైమరీ పాఠశాలలా ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపించడం జరిగిందన్నారు. కస్తూరిబా గాంధి విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీకి సన్నద్ధం కొరకు కోచింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా విద్యా శాఖ వారోత్సవాలను మే 11 నుండి పకడ్బందిగా నిర్వహిస్తామని తెలిపారు. వారోత్సవాలలో భాగంగా పాఠశాలల్లో అదనపు గదులు, మోలిక వసతుల పనులు చేపడ్తమాన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

## * మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల సాయికుంట ప్రాంతంలో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి, క్రిటికల్ కేర్ విభాగాల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 129.25 కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయల వ్యయంతో క్రిటికల్ కేర్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు గుత్తేదారుల సమన్వయంతో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి దరఖాస్తుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63, 163 జి రహదారుల ఏర్పాటులో భాగంగా జిల్లాలోని ప్రాంతాలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కార చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సన్మానిస్తున్న సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్

## విద్యార్థులను సన్మానించిన సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్

**భైంసా, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని మహాగం (బి) గ్రామంలో పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అనిత అభినందించారు. ఫలితాల్లో హర్షిత 548 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, గిరి సాక్షి 541 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహాగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు ముత్యం రెడ్డిని, ఇతర గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్

## పదవ తరగతి విద్యార్థులను సన్మానించిన భోస్లే మోహన్ రావు పటేల్

**భైంసా, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని తన నివాసంలో బుధవారం విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ అభినందించారు. ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు సొంకాంబ్లె ప్రియాంక, సిందే గగన, సిందే శ్రవణ్ కుమార్‌లను ఆయన శాలువాతో సన్మానించి, ప్రజా ట్రస్ట్ మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, పట్టుదలే ఈ విజయానికి కారణమని ప్రశంసించారు. భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో

# బాలికల హవా

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. స్థానిక ఆదర్శ పాఠశాలలో మొత్తం 88 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 35 మంది బాలికలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 53 మందికి గాను ఒక్కరు మినహా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలో చట్ల సంజన 572 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ వి. సంగీత తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో 23 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇందులో ఎస్. ఆత్మిక 559 మార్కులతో మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్వేతారాణి పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 49 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఒక్కరు మినహా మిగిలిన వారు ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాల నుంచి రాబ్డే త్రిష 557 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రధానోపాధ్యాయులు జే. భూమన్న తెలిపారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.




అవగాహన కల్పిస్తున్న తహసిల్దార్ శ్యాంసుందర్, డివిఎంసి సభ్యులు జంగు బాపూ

## టెంబి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

మండలంలోని టెంబి గ్రామంలో గురువారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కే. శ్యాంసుందర్ హాజరై ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం అమలు తర్వాత ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో సానుకూల మార్పులు వచ్చాయని ఆయన తెలిపారు. డివిఎంసి సభ్యులు మెస్రం జంగు బాపూ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తమ విధులను సక్రమంగా పాటించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కులమతాల మధ్య విద్వేషాలు లేకుండా సోదర భావంతో మెలగాలని సూచించారు. కుల వివక్షకు తావులేకుండా రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్, జీపీఓ వచ్చు రవీందర్, పంచాయతీ కార్యదర్శి తాహిర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వాసవి స్కూల్ హవా.. 100 శాతం ఉత్తీర్ణత

**నిర్మల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని స్థానిక వాసవి పాఠశాల 2025-26 విద్యా సంవత్సర పదవ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచింది. పరీక్షలు రాసిన 311 మంది విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 271 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించి సత్తా చాటారు. ఇద్దరు విద్యార్థులు 587 మార్కులు సాధించగా, 15 మంది 580 పైన, 43 మంది 570 పైన, 82 మంది 560 పైన, 128 మంది 550కి పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతా రెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ శెట్టి, రాజకుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## స్కూల్ నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

బోథ్ మండల కేంద్రంలోని పొచ్చెరా ఎక్స్ రోడ్డు వద్ద నిర్మించనున్న రిజోనేన్స్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేలా విద్యా సంస్థలు కృషి చేయాలని కోరారు. అనంతరం పాఠశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ గొప్ప వరం

**భైంసా, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**



ప్రభుత్వ ఉద్యోగంలో చేరి 35 ఏళ్లుగా నీతి నిజాయితీతో ప్రజలకు సేవలు అందించిన జాడే లక్ష్మణ్ పదవీ విరమణ పొందడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువారం పట్టణంలోని బృందావనం గార్డెన్‌లో ప్రజ్ఞ శీల అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు జాడే లక్ష్మణ్ పదవీ విరమణ అభినందన సభ నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాడే సురేదాస్ మాట్లాడుతూ తాము ఎంతో పేదరికం నుంచి వచ్చి, కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించామని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. వెంకట్రావు జాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు అంటే ఒక ఉద్యమమని, పదవీ విరమణ తర్వాత కూడా సామాజిక సేవలో పాలుపంచుకోవాలని కోరారు. బాజీ రెడ్డి మాట్లాడుతూ లక్ష్మణ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీ చందనే, పుండలిక్, బీవీ వెంకట రమణారావు, భూమన్న, మహేష్, దేవేందర్, దాసరి శంకర్, రవి కిరణ్, గంగాధర్, గజ్జరం, గోపాల్, బొడ్డు లక్ష్మణ్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి అజయ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

*** జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**



**వేమనపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

ప్రధానమంత్రి అజయ్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి లక్ష్యాలను సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని వేమనపల్లి మండలం నీల్వాయి, సుంపుటం, నాగారం, బుయ్యారం గ్రామాలలో పర్యటించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలు ప్రక్రియను పరిశీలించారు. నీల్వాయి గ్రామంలో నిర్వహించిన జనగణన శిక్షణ తరగతులకు హాజరై సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించారు. జనగణన ప్రక్రియను ఖచ్చితంగా, పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. సుంపుటం గ్రామపంచాయతీని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు అటవీశాఖ అధికారుల వల్ల నిలిచిపోయిన అంశంపై విచారణ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, అటవీ శాఖ అధికారి, తహసీల్దార్‌తో చర్చించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నాగారం గ్రామపంచాయతీ నూతన కార్యాలయ భవనాన్ని సందర్శించి, పెన్షన్ లబ్ధిదారులు, బిపిఓ, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి గ్రామంలోని సంక్షేమ పథకాల అమలు పరిస్థితిని సమీక్షించారు. బుయ్యారం గ్రామపంచాయతీని సందర్శించి ఎస్‌సి కాలనీలో పి.ఎం. అజయ్ పథకం క్రింద చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకుని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధం, త్రాగునీరు, డ్రైనేజ్ వ్యవస్థల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో డీఎల్పిఓ సతీష్, ఎంపిడిఓ కుమారస్వామి, ఎంపీఓ వెంకటేష్, డిటి సాయికృష్ణ సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్ల పట్టివేత

**జన్నారం, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

జన్నారం డివిజన్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఇంధనపెల్లి ఎఫ్ఆర్వో లక్ష్మీ నారాయణ తెలిపారు. ఎఫ్‌డిఓ రామ్మోహన్‌కు వచ్చిన సమాచారం మేరకు ఇంధనపెల్లి సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించగా వాగులు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని పట్టుకుని ఇంధనపెల్లి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ సందర్భంగా ఎఫ్.ఆర్.ఓ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ అడవి ప్రాంతంలోని ఈకో సెన్సిటివ్ జోన్‌లో అక్రమ ఇసుక రవాణా చేస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా అక్రమ కలప రవాణా చేసిన, వన్యప్రాణులను వేటాడిన అట్టి వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రవి, ఎఫ్‌బిఓలు రాజేశ్వర్, శ్రీనివాస్ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు




సన్మానిస్తున్న అదనపు డీసీపీ

## ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ ఆత్మీయ వీడ్కోలు

**వేమనపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

నీల్వాయి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందుతున్న బి. రాజయ్యను అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ కార్యాలయంలో పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసు శాఖేనని, అలాంటి వారు ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా గడుపుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శేఖర్, రమేష్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, సభ్యుడు నసీర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇట్టి ఇంటర్వ్యూలో 8 యూనిట్స్ గాను 29 మంది ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడం జరిగింది. అందులో భాగంగా కొంతమంది మాత్రమే ఈ ఇంటర్వ్యూ కు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, బ్యాంకు మేనేజర్స్, మెప్మా టిఎంసి యం. శంకరయ్య హాజరు కావడం జరిగింది.





మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న కుచాడి శ్రీహరి రావు

## మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించిన కుచాడి శ్రీహరి రావు

**నిర్మల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను కుచాడి శ్రీహరి రావు బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ, తూకం, రవాణా సౌకర్యాలపై ఆరా తీశారు. మొక్కజొన్న తూకం, రవాణా విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేవలం గన్నీ సంచుల కొరత వల్ల ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించిన ఆయన అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులు, రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించారు. అనంతరం నిర్మల్ నియోజకవర్గానికి 6 లక్షల గన్నీ బ్యాగులను కేటాయించేందుకు అధికారులు అంగీకరించారని వెల్లడించారు. ఈ గన్నీ బ్యాగులు రెండు, మూడు రోజుల్లో నిర్మల్‌కు చేరుకుంటాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కొట్టే శేఖర్, నాయకులు అయ్యన్నగారి పోశెట్టి, అడప శ్రీకాంత్, గద్దింటి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఎమ్మెల్యే మార్నింగ్ వాక్

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మార్నింగ్ వాక్ నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఉదయం 7 గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామంలో, అనంతరం రాంపూర్ గ్రామంలో ఆయన పర్యటిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

## పదో తరగతి ఫలితాల్లో నేరడిగొండ విద్యార్థుల ప్రతిభ

**నేరడిగొండ, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:**

నిన్న ప్రభుత్వం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో నేరడిగొండ మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. కేజీబీవీ పాఠశాల నుండి ఎ. అంకిత 542, ఎస్. స్వాతి 541 మార్కులు సాధించగా, బుగ్గారం గురుకులం నుండి జాదవ్ అమిత 572 మార్కులతో రాణించారు. అదేవిధంగా ఆడే వైష్ణవి, ఆడే సంధ్య 566 మార్కులు సాధించినట్లు పాఠశాలల ప్రిన్సిపాల్స్ కృష్ణవేణి, రజిత, సంగీత తెలిపారు. సోషల్ వెల్ఫేర్ గురుకులం నుండి సంకీర్తన 557, సమీక్ష 559 మార్కులు సాధించగా, లక్కంపూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థిని పి. శాలిని 568 మార్కులు సాధించి మండల స్థాయిలో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. నేరడిగొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు నేహా 545, హేమలత 515 మార్కులు సాధించినట్లు ఇన్చార్జి ఎంఈఓ భూమారెడ్డి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## దగ్ధమైన మొక్కజొన్న పంట..

**- కన్నీరుమున్నీరవుతున్న రైతు**

**సారంగాపూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



మండలంలోని కౌట్ల (బి) గ్రామ శివారులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎకరం మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన సాధు గంగారెడ్డి అనే రైతుకు చెందిన పొలంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతుండటంతో, అవి ఒకదానికొకటి రాపిడికి గురై నిప్పురవ్వలు పడ్డాయి. దీంతో క్షణాల్లో మంటలు వ్యాపించి చేతికి వచ్చిన పంట కళ్లముందే బూడిదైందని రైతు వాపోయారు. చుట్టుపక్కల రైతులు వెంటనే స్పందించి మంటలు ఇతర పొలాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. కష్టపడి పండించిన పంట బొగ్గుపాలు కావడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యారు. పంటలు దగ్ధమవుతున్నా మండల స్థాయి అధికారులు స్పందించడం లేదని, కనీసం వివరాలు సేకరించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతును ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### ఉపాధి హామీ పని ప్రదేశంలో

# కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ఆసిఫాబాద్/ రెబ్బన, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

ఉపాది హామీ పథకంలో కూలీలు పని చేసే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హరిత అన్నారు. గురువారం రెబ్బెన మండలంలోని ఇందిరా నగర్ గ్రామ పంచాయతి శివారులో ఉపాది హామీ పని ప్రదేశాన్ని కలెక్టర్ హరిత సందర్శించారు. ఉపాధి హామీ కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాల పై కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాది హామీ కూలీలకు పని ప్రదేశంలో, త్రాగు నీరు, నీడా, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ తీవ్రతల దృష్ట్యా ఉపాది కూలీలు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాది హామీ పతాకంలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అర్హులైన ప్రతి ఉపాది హామీ కూలీలకు 100 రోజులు పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమములో పంచాయతి కార్యదర్శి ఉపాది హామీ కూలీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరిత



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## సీసీ రోడ్డుకు భూమిపూజ

పెంచికల్ పేట్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :

మండలంలోని మురళీగూడ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లేడ సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ వెంకటేష్ గురువారం భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు లేక వర్షాకాలంలో బురద, గుంటల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చొరవతో సీసీ రోడ్డు మంజూరు కావడంతో సమస్య పరిష్కారం అవుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు ప్రభాకర్, శ్రీను, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణే పోలీసుల లక్ష్యం

### - తాండూర్ సీఐ దేవయ్య

తాండూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త :

నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల లక్ష్యమని తాండూర్ సిఐ దేవయ్య అన్నారు. అచ్చలాపూర్ గ్రామంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భముగా సిఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాల పాల్పడిన, అనుమానితులు సంచరించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. నేరాల నియంత్రణ, ప్రజలలో భద్రత భావాన్ని పెంచడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. నేరాల నియంత్రణ కొరకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని, ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. ప్రధాన కూడళ్ళు, ప్రతి ఇంటి పరిసర ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ సిసి కెమెరాలు పెట్టుకోవడం వలన దొంగతనాలు నేరాలు అసాంఘిక కార్యకలాపాలు జరిగిన నిందితులను పట్టుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించిన, కొనుగోలు చేసిన కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలను ఇవ్వరాదని, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్లరాదని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపించాలన్నారు. ఆన్లైన్ సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు పోలీసులు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో తాండూర్, మాదారం, కన్నెపల్లి, భీమిని ఎస్సైలు ప్రసాద్, సౌజన్య, భాస్కర్ రావు, కోటేశ్వర్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కూలిన గోడ.. సర్పంచ్ ఆర్థిక సహాయం

పెంచికల్ పేట్, ఏప్రిల్, 30, ప్రభాతవార్త :

మండలంలోని ఎల్లూర్ కొత్తగూడ గ్రామానికి చెందిన జాడి శీల ఇంటి గోడ ప్రమాదవశాత్తు గురువారం కూలిపోగా సమాచారం అందుకున్న సర్పంచ్ చప్పిడి రవీందర్, ఆర్ఐ రాజేశ్వర్ రావుతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలికి తక్షణ ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న సర్పంచ్ రవీందర్

## మహిళల రక్షణ అందరి బాధ్యత

### - కెరమెరిలో పోష్ యాక్ట్ చట్టంపై అవగాహన



కెరమెరి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:

మహిళల రక్షణ, గౌరవం, వారి హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్సై ఎన్. మధుకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా (ఉద్యోగ స్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ) చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. మహిళల భద్రత, గౌరవం, హక్కుల పరిరక్షణ ధ్యేయంగా ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యాలయాల్లో మహిళలు ఎదుర్కొనే సమస్యలు, లైంగిక వేధింపుల వివిధ రూపాలు, వాటి నివారణకు చట్టపరమైన రక్షణ వంటి అంశాలపై వివరించారు. ఉద్యోగ స్థలాల్లో మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగినా వాటిని సహించకూడదని, వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటు తప్పనిసరి అని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి న్యాయం పొందాలని తెలిపారు. అలాగే మహిళల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, చట్టపరమైన రక్షణ విధానాలు, ఫిర్యాదు నమోదు ప్రక్రియపై కూడా వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది తమ సందేహాలను వ్యక్తం చేయగా, అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమం ద్వారా మహిళా ఉద్యోగుల్లో చట్టంపై స్పష్టత పెరగడంతో పాటు, తమ హక్కులను కాపాడుకోవాలనే ధైర్యం పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ ఈ అవగాహన సదస్సులో ఎంపిడిఓ సాయి గౌడ్, మెడికల్ అఫిసర్ రియాన్, సూపర్ వైజర్ సోము, ఏం ఎల్ హెచ్పి శ్యాంరావు అంగన్వాడీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న కుచాడి శ్రీహరి రావు

## కాంగ్రెస్ నేతలకు కుచాడి శ్రీహరిరావు పరామర్శ

నిర్మల్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త

నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాండేదాపు చిన్ను, బుధవార్‌పేట్ మున్నూరుకాపు సంఘం ప్రతినిధి మగ్గిడి వెంకటిని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కుచాడి శ్రీహరి రావు పరామర్శించారు. ఇటీవల చిన్ను కాలికి గాయం కాగా, వెంకటి అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్‌తో కలిసి వారి స్వగృహాలకు వెళ్లిన శ్రీహరి రావు, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనారిటీ రాష్ట్ర నాయకుడు చోటా అజర్, జిల్లా అధికార ప్రతినిధి కొట్టే శేఖర్, నాయకులు అయ్యన్నగారి పోశెట్టి, అడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి: కలెక్టర్ రాజర్షి షా

నార్నూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త:

జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం నార్నూర్ మండల కేంద్రంలో పర్యటించారు. మండలంలోని నడ్డంగూడ గ్రామంలో వెదురు పరికరాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జమాడ గ్రామంలో నిర్వహించిన ఇప్పపువ్వు లడ్డు దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇప్పపువ్వు లడ్డు తయారీకి రాష్ట్రపతి అవార్డు లభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ మందా మకరందం, పీడీ రవీందర్ రాథోడ్, సర్పంచ్ సత్యం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కంపెనీ అభివృద్ధిలో ఉద్యోగుల సేవలు మరువలేనివి

### - ఆర్.కె-7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్

నస్పూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త



సింగరేణి సంస్థ అభివృద్ధిలోనూ, ఉత్పత్తి లక్ష్యాల సాధనలోనూ ఉద్యోగుల సేవలు మరువలేనివని ఆర్.కె-7 గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్ పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె న్యూటెక్ గనిలో జూనియర్ మైనింగ్ అధికారిగా సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కరుణాకర్ రాజును గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎస్టీపీపీ డీజీఎం ఈ. స్వామి రాజు, గని మేనేజర్ కె. శ్రీనివాసుతో కలిసి రాజేందర్ ఆయనను శాలువాతో సత్కరించారు. సుదీర్ఘ సర్వీసు కాలంలో కరుణాకర్ రాజు కంపెనీకి అందించిన సేవలను అధికారులు ఈ సందర్భంగా కొనియాడారు. విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శనీయమని ప్రశంసించారు. పదవీ విరమణ తర్వాత ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషంగా గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి కొట్టే రమేష్, సీనియర్ సంక్షేమ అధికారి పాల్ సృజన్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, ఇంజనీర్ కృష్ణ, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, ఐఎన్టీయూసీ కేంద్ర నాయకుడు గరిగె స్వామి, గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్ మనోజ్

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### - బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్

**తాండూర్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త**

ప్రజల సమస్యలను అధికారులు పరిష్కరించాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయంలోని రికార్డులను సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. వివిధ సమస్యలపై రైతులు, విద్యార్థులు, ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంప్ ప్రారంభిస్తున్న దస్తగీర్ అహ్మద్

## కుమ్రం భీం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్,ఏప్రిల్ 30, ప్రభాతవార్త :**

కుమురం భీం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ బాక్సింగ్ శిక్షణ శిబిరం గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎఫ్ కాలనీ సిర్‌సిల్క్ ప్రాంతంలో ప్రారంభమైంది. ఈ శిబిరం ఏప్రిల్ 30 నుంచి మే 31 వరకు కొనసాగనుంది. ఈ శిబిరాన్ని మాజీ ఎంసీకే చైర్మన్ దస్తగీర్ అహ్మద్ ప్రారంభించగా, అసోసియేషన్ అధ్యక్షుడు వేముర్ల మధు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జయేందర్, బాక్సింగ్ చైర్మన్ శివ నాయర్, కార్యదర్శి మధురై శేఖర్, సభ్యులు అల్లాడి రాజు, అబ్బాస్ ఖాన్, వాసీమ్, రాకేష్ తదితరులు హాజరయ్యారు.కోచ్‌లు సాయి కుమార్, శివ, వంశీ, రాజశేఖర్ క్రీడాకారులకు నైపుణ్యపూర్వక శిక్షణ అందిస్తున్నారు. ఈ సమ్మర్ క్యాంప్ ద్వారా యువతలో క్రీడలపై ఆసక్తిని పెంపొందించి, ప్రతిభను వెలికితీయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు

**మందమర్రి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

మందమరి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో జరుగుతున్న వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, మాజీ మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధువును ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ వేడుకలో పాల్గొన్నారు.



### వేజ్ బోర్డు కమిటీ ఆలస్యంపై

# బీఎంఎస్ అసంతృప్తి, ఆందోళనలకు పిలుపు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**




దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికులకు సంబంధించిన 11వ వేతన ఒప్పంద కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో, 12వ వేతన సంఘం (వేజ్ బోర్డ్) కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం ఈ ఏడాది జూన్ నెలలో ముగియనున్నందున, జూలై 1లోపు 12వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని కోల్ ఇండియా యాజమాన్యాన్ని ఆయన కోరారు. ఇప్పటివరకు కమిటీ ఏర్పాటుపై ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, నిర్మాణానికి చర్యలు తీసుకోకపోవడం కార్మికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోందని తెలిపారు. ఈ అంశంపై గత నెల 9, 10 తేదీల్లో ఒడిశా రాష్ట్రంలోని తాల్చేర్-అంగుల్ ప్రాంతంలో నిర్వహించిన బీఎంఎస్ 113వ వర్కింగ్ కమిటీ సమావేశంలో కూడా చర్చించామని చెప్పారు. దేశంలోని బొగ్గు పరిశ్రమల్లో యాజమాన్యాలు కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. దీనికి నిరసనగా కోల్ ఇండియా, సింగరేణి గనుల్లో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు సత్తయ్య ప్రకటించారు. 12వ వేతన సంఘం ఏర్పాటు కోసం సింగరేణి పరిధిలోని అన్ని గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులు, విభాగాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమ పథకాలు, సెలవులు (ప్లే డేలు), పబ్లిక్ హాలిడేలు వంటి అంశాల్లో కోతలు విధించడం సరికాదని ఆయన అన్నారు. కార్మికుల వేతన సవరణలో కంపెనీ ఆర్థిక పరిస్థితులను కారణంగా చూపుతున్న యాజమాన్యం, అధికారుల వేతనాల విషయంలో మాత్రం ఉదారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అదే సమయంలో, సింగరేణి సంస్థకు విద్యుత్ సంస్థలు చెల్లించాల్సిన సుమారు రూ.51,149 కోట్లు బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన విద్యుత్ సంస్థల నుండి రావలసిన బకాయిలను యుద్ధ ప్రాతిపదికన వసూలు చేయాలని కోరారు. దీంతో పరిశ్రమ పరిరక్షణతో పాటు కార్మికుల ఉద్యోగ భద్రత, సంస్థ ఆర్థిక స్థిరత్వం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీఎంఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కారంపూడి శ్రీనివాసరాజు, ముందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ దొనికెల రమేష్, ఏరియా నాయకులు గుర్రం ప్రదీప్ కుమార్, నాతాడి శ్రీధర్ రెడ్డి, చెట్టి వీరన్న, ఊరకొండ తిరుపతి, కొమ్మ బాబు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

మే 1వ తేదీన జిల్లాలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో మే 1వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న వేడుకలకు కార్మికులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు జిల్లాలోని మండలాలలో జరిగే వివిధ కార్యక్రమాలను ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



విద్యార్థులను సన్మానిస్తున్న మండల విద్యాధికారి

## మండల స్థాయిలో ర్యాంక్ సాధించిన వారికి సన్మానం

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

పదవ తరగతి ఫలితాల్లో మండలంలో టాపర్‌గా నిలిచిన విద్యార్థినిలకు అభినందన కార్యక్రమం నిర్వహించినట్లు మండల విద్యాధికారి జీ. శైలజ అన్నారు. గురువారం రోజు లక్షెట్టిపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు మండలంలో అత్యధిక మార్కులు 600/567,600/562 సాధించిన ఎం రిషిక, ఎం. తిరుమలతో పాటు 500 మార్కులు పైబడి సాధించిన 15 మంది జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి జి. శైలజ, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... పై చదువుల పట్ల శ్రద్ధ పెడుతూ, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని, గవర్నమెంట్ పాఠశాలల పట్ల తల్లిదండ్రులు తమ పిల్లలను చేరే విధంగా ప్రోత్సాహం చూపించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పనిచేస్తున్నాయి అని, అందుకు నిదర్శనమే ఈ ఫలితాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రవణేష్ అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థిక సహాయం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**

బెల్లంపల్లి మండలం మాల గురిజాల గ్రామ పంచాయతీ పరిధిలోని రంగపేట గ్రామానికి చెందిన గద్దల రవణేష్ అంత్యక్రియలకు గురువారం అంబేద్కర్ సేవ కమిటీ రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసింది. గద్దల రవణేష్ (30) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రవణేష్ మృతితో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ సేవ కమిటీ అతని అంత్యక్రియల కోసం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసి మానవత్వాన్ని చాటుకుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు దుర్గం సుమన్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే రవణేష్ ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగు పెంచండి

### - రైతు అవగాహన సదస్సులో శాస్త్రవేత్తల సూచన

**చెన్నూరు, ఏప్రిల్ 30, ప్రభాతవార్త**



రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ సాగు పద్ధతిలో పంటలు పండించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో గురువారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ద్వారా సేంద్రియ పంటల సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రావు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని, కర్చుకుడా దక్కుతుందని తెలిపారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, ప్రకృతి సేద్యం ద్వారానే పంట దిగుబడి పెరుగుతుందని అన్నారు. చెన్నూర్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించడంతో పాటు రసాయనాల వినియోగం తగ్గించాలని, నేల సారాన్ని కాపాడుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కే యామిని మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సూక్ష్మ, స్థూల పోషకాల ఆవశ్యకత, పంట ఉత్పత్తి, భాస్వరాన్ని కరగదీయు బ్యాక్టీరియా పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. రాజశేఖర్ చెన్నూరు మాజీ ఎంపిటిసి గడల సాలక్క అభ్యుదయ రైతులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.